
# నీలాంటి ఒకరు

కె.వి.ఎస్.వర్మ



## ఇక్కడ ఇంటిలో ఈమె

మిరపకాయ ముక్కలు కోసిన చెయ్యి తగలడంతో కమల కళ్లు మండాయి. అప్పటికే ఆవెకు ఒళ్లు మండిపోతూ వుంది.

"మరీ మందమరుపు ఎక్కువయిపోతోంది. ఇందాకే చెయ్యి కడుక్కొని వుంటే ఈ బాధ వుండకపోను కదా" అనుకుంది.

ఆ వెంటనే.

"ఇప్పుడీ వంట చెయ్యడం మానేసి ముసుగు తన్ని పడుకుండిపోతేనో" అనుకుని ఆలోచనలో పడింది.

ఆయన అసలే ఆకలికి ఆగలేరు. అంత దూరం నుంచి సిటీ బస్సులో వచ్చి, మళ్లీ ఏ హోటల్‌కో వెళ్లి తినిరావాలి. ఏం? ఒక రోజుకి ఆ మాత్రం శ్రమపడ లేడా? అతను హోటల్‌కెళ్లి తినాలని ఆలోచిస్తోందే కానీ, తన తిండి గురించి ఆలోచించదేం? తన ఆలోచన్లు ఇంకా మారాలి. ఇవేళ తను వండకపోతే, అతను వండిపెట్టాలి కదా. అతనికి వంటరాదు. ఎవరిది తప్పు? అతనికి వంట నేర్పని అత్తగారిది తప్పు. ఆ తర్వాత నేర్పని మనది తప్పు. ఎక్కడికెళ్లీ తన మీదకే వస్తుంది ప్రతీదీ.

కమల ఆలోచిస్తూనే కూర పోపు పెట్టింది. పోపు ఘాటుకు దగ్గొచ్చింది.

ఈ దగ్గులూ తనకే. ఎక్కడిలేని ఎగ్గులూ తనకే.

పొద్దుట తను అలా అనకపోయి వుంటే బావుండునా? ఎవరికి? అతనికి! మరి తనకో? బావుండకపోను. తనకి బావున్నప్పుడు అతని గురించిన ఆలోచనెందుకు? ఎంతయినా భర్త కదా! భర్తంటే భరించేవాడట కదా. అతనే అన్నాడు.

అతను. తన భర్త. 'అతను, అంటావేం? అందరిలా ఆయన అనలేవా' అన్నాడు కొన్నేళ్ల క్రితం. అందులో తప్పేమిటో మొదట తనకు తెలియలేదు. అయినా తను 'ఆయన' అని ఇతరులతో అనడం అలవాటు చేసుకుంది.

అలవాటు. అదొక్కటేనా తను అలవాటు చేసుకుంది? పరిచయమై కొన్నేళ్లు కలిసి తిరిగాక. కొందరు ఫ్రెండ్స్‌మి నువ్వా నువ్వా అనుకునే వాళ్లం. అలాగే కొన్నాళ్ల తర్వాత భర్తని నువ్వు అంది. అతను.... ఆయన.... అతనే మొదట ఎంత ఆశ్చర్యంగా చూశాడు! అతనికి ఎంత కోపం వచ్చింది.

"ఇప్పుడంటే అలా అన్నావు. ఇంకెప్పుడూ అలా అనకు. ఎప్పటిలాగే 'మీరు' అను. ఎవరన్నా వింటే ఏమనుకుంటారు" అన్నాడు.

ఎవరో ఏదో అనుకుంటారని మర్యాదలు పాటించాలా? 'నువ్వు'లో వుండే దగ్గరితనం 'మీరు'లో వుంటుందా? వుండదని తెలిసీ మీరు అనే పాత అలవాటునే కొనసాగిస్తోంది తను. అన్నిటికీ కొనసాగింపులే.

తన తల్లి తన తండ్రిని మీరు అన్నట్టుగానే తనూ తన భర్తను మీరు అంటోంది. దీనివల్ల ఏమన్నా నష్టం వుందా? వుంది అంటే వుంది. లేదు అంటే లేదు. అసలు లేదా? కొంత వుంది కదా. దగ్గరితనానికి దూరం వుంచింది కదా.

ఇవేళ్టితో తననుకుంటున్న దూరం మరింత ఎక్కువవుతుందా? రెండ్రోజులుగా ఆయన... అతను, అతను, అవునతనే పాతికవేలు కావాలంటున్నాడు. నిన్నటిదాకా తను మౌనంగా ఊరుకుంది.

"ఇస్తావో, ఇవ్వవో స్పష్టంగా చెప్పు" అంటూ నిలదీశాడు పొద్దుట.

ఇక లాభం లేదని "ఇవ్వను" అంది.

అతను ఆశ్చర్యంతో ఒక క్షణం అలాగే వుండిపోయాడు.

"ఇవ్వనంటావు" అన్నాడు నెమ్మదిగా.

"చెప్పానుగా ఇవ్వనంటే ఇవ్వను. ఎందుకివ్వాలి"

"నేను మరింత మంచి ఉద్యోగం చేస్తే, నీకు మంచిది కాదా"

"నాక్కాదు"

"నీక్కాదూ... ఒక్క నాకేనా..."

"మీకే. సూటూ బూటూ వేసుకుని, కారు కూడా కొనుక్కొని షికార్లు చెయ్యవచ్చు. ఇప్పటిలా నెలకో రెండు నెలలకో కాకుండా ప్రతి వారం మీ స్నేహితులనో చుట్ట పక్కాలనో ఇంటికి పిలవొచ్చు" అంటూ తను విసవిసా వంట గదిలోకి వెళ్లిపోయింది.

కాసేపటికి అతను స్కూటర్ స్టార్ట్ చేసిన శబ్దం వినిపించింది.

తను గబగబా వీధి వరండాలోకెళ్లి రోడ్డు మీదకు చూసింది. అతను స్పీడుగా వెళ్లిపోతున్నాడు.

తను సోఫాలో కూర్చుని తల వెనక్కి వాల్చి కళ్లు మూసుకుంది. మనశ్శాంతిగా వుంది. కడుపుమంట కొంత చల్లారినట్టుంది. కడుపు మంటేనా? మాట వరసకి

కడుపుమంటే. నిజానికది మనసు మంట.

తనువుకెన్ని గాయాలైనా మానిపోవు ఏలాగైనా, మనసుకొక్క గాయమైనా మాసిపోదు చితివరకైనా.... తను ఎప్పుడో విందీ పాట. ఇప్పుడే విన్నట్టుగా వుంది.

మొన్నటికి మొన్న.....

అతను తన స్నేహితుల్ని భోజనాలకి పిలిచాడు. పిలిచే ముందు తనకొక్కమాట చెప్పలేదు.

"పిలిచే ముందు నాకు చెప్పండి. ఒకోసారి వండిపెట్టడం నాకు కుదరకపోవచ్చు" అని నెలరోజుల క్రితం అతను ఇలాగే చేస్తే తను చెప్పింది.

ముఖం గంటు పెట్టుకున్నాడు. అయినా తన మాట వినలేదు. భార్య మాట వినడం ఏటి అనుకున్నాడో ఏంటో ఈ మగాడు!

తను అయిష్టంగానే వంట చేస్తోంది. వాళ్లొచ్చారు. అతను వాళ్లతో కబుర్లూ, నవ్వులూనూ. ఎప్పటిలాగానే తనకే సాయమూ చెయ్యలేదు. కొంత సేపటికి "మీ మిసెస్ ఏరీ" అంటూ విశాలాక్షి వంట గదిలోకొచ్చి. తనకు సాయం చెయ్యబోయింది. అయితే, అప్పటికే వంట పూర్తయింది.

ఇక భోజనాలప్పుడు చూడాలి. అతను జోకులు తెగ పేల్చాడు.

"మా ఆవిడ వంట బాగా చేసన్తుంది. వెరైటీగా చేస్తుంది. ఈ కూర చూడండి. పులుపు ఎక్కువయ్యింది కదూ. డోంట్ వర్రీ. ఈ కూరలో ఉప్పు ఎక్కువయ్యింది కదూ. డోంట్ వర్రీ. రెండు కలిపేస్తే సరి" అంటూ పగలబడి నవ్వాడు.

వాళ్లు పెద్దగా నవ్వడానికి మొహమాటపడిపోయారు. భోజనాలయి, వాళ్లు వెళ్లేటప్పటికి మధ్యాహ్నం రెండు గంటలయింది. అప్పటికి గానీ తను స్నానం చేసి, బట్టలు మార్చుకోడానికి వీలు దొరకలేదు. రెండున్నర తర్వాత తను భోజనం చేసింది.

కేబుల్ టీవీలో ఏదో సినిమా చూస్తూ "వాళ్లు రాకముందే ఫ్రెష్‌గా తయారయివుంటే శుభ్రంగా వుండేదానివి. ఇందాకటి దాకా అప్పలమ్మలా వున్నావు" అన్నాడు.

"షటప్" అందామనుకుంది. ఆ మాటనడానికి కూడా తనకు అసహ్యమేసింది.

మాడు వాసన వేయడంతో కమల ఈ లోకంలోకొచ్చింది.

"అయ్యో, కూర మాడింది" అనుకుంది. "ఆకలేస్తే వచ్చినట్టు అతనే తింటాడు" అనుకుంటూ ముందు గదిలోకొచ్చి, అల్మరాలోంచి కథల పుస్తకం తీసింది.

## అక్కడ ఆఫీసులో అతను

బ్రాంచి ఆఫీనుకు వంపాల్సిన లెటర్‌లో తప్పులున్నాయేమోనని కృష్ణమోహన్ పదోసారి చదివాడు. లెటర్ సరిగా వున్నట్టు లేదని అనుకున్నాడు. తప్పు ఎక్కడుందో మాత్రం తెలియడం లేదు. అతని కళ్లు ఆ లెటర్‌ని చూస్తున్నాయే కానీ, అందులోని అక్షరాలు అతని మెదడుకు అందడం లేదు "అది పూర్తిగా మారిపోయింది" అనుకున్నాడు.

"అదీ ఇదీ అనకండి. నాకు పేరుంది కదా. పోనీ, ఆమె అనండి" అంది ఓ సారి కమల కోపంగా.

ఆ తర్వాత, ఎవరి దగ్గరన్నా కమల ప్రస్తావన వచ్చినప్పుడు కమల అని కానీ, ఆమె అని కానీ, మా ఆవిడ అని కాని అంటున్నాడు. ఆ అభిమానం ఏమన్నా వుందా ఆమెకి... దానికి! అవును, దానికే.

ఆమె.... అది! అవునదే. అది మరీ డబ్బు మనిషైపోయింది. రాక రాక తనకో మంచి అవకాశం వచ్చింది. బొంబాయిలో ఆర్నెల్లపాటు ఆ ట్రైనింగ్ పూర్తి చేసుకుని వస్తే తను ఏదో ఒక బ్రాంచి ఆఫీసుకు మేనేజర్ అవుతాడు. బొంబాయిలో ఆర్నెల్లు వుండాలంటే ఎంత జాగ్రత్తగా ఖర్చు పెట్టుకున్నా ఇరవై వేలుండాలి. తనేమీ పొదుపు చేయలేదు. ట్రైనింగ్ సమయం ఆర్నెల్లకూ సెలవు ఇస్తామనీ, ఆ ఖర్చు మాత్రం ఆఫీసు భరించదనీ తమ ఎం.డి చెప్పాడు. అందుకే కమలని... దాన్ని పాతిక వేలు అడిగాడు తను. లేవు పొమ్మంది.

ఆఫీసులో ఈ చాకిరీ చేస్తోంది ఎందుకు? దాని కోసం కాదూ. తనకు ప్రమోషన్ వస్తే తనొక్కడికేనా సుఖం? దానికి మాత్రం వుండదూ? ఆ జ్ఞానం లేకుండా ఇవ్వనంటుందా? దాని పేర బ్యాంకులో వాళ్ల నాన్న వేసిన యాభై వేలున్నాయి కదా. అందులో ఓ పాతిక వేలు ఇవ్వడానికేం? వట్టి డబ్బు మనిషి.

'తనువుకెన్ని గాయాలైనా మానిపోవు ఏలాగైనా, మనసుకొక్క గాయమైనా మాసిపోదు చితివరకైనా....' తను ఎప్పుడో విందీ పాట. ఇప్పుడే విన్నట్టుగా వుంది. మొన్నటికి మొన్న.....అతను తన స్నేహితుల్ని భోజనాలకి పిలిచాడు. పిలిచే ముందు తనకొక్కమాట చెప్పలేదు.....ముఖం గంటు పెట్టుకున్నాడు. అయినా తన మాట వినలేదు. భార్య మాట వినడం ఏటి అనుకున్నాడో ఏంటో ఈ మగాడు!

పెళ్లయిన కొత్తలో ఇలా లేదు. తనంటే ఎంత అభిమానంగా వుండేది!

"ఆఫీసుకు సిటీ బస్సులో వెళ్లి వచ్చేటప్పటికి బాగా రాత్రయి పోతోంది. ఓ స్కూటర్ కొనుక్కోండి" అంది మూడేళ్ల క్రితం.

"అంత డబ్బుండొద్దూ"

"బ్యాంకులో నాది వుంది కదా"

"నీ డబ్బా, వద్దు"

"అంటే, నన్ను మీ నుంచి వేరు చేస్తున్నారా? లేక ఆడదాని సొమ్ము ముట్ట కూడదనే నియమం పెట్టుకున్నారా" అంది కమల చిరుకోపంగా.

"అలాంటిదేం లేదు" అన్నాడు తను.

పదిహేను వేలు డ్రా చేసి ఇచ్చింది. తను కూడా షోరూమ్ కొచ్చింది. ఇద్దరికీ నచ్చిన కలర్‌ది కొన్నారు. ఆ రోజే తామిద్దరూ కొత్త స్కూటరెక్కి ఇంటికొచ్చారు. మర్నాటి నుంచీ తను ఆరున్నరకే ఇంటికొచ్చేసేవాడు.

"చూశారా, నా ఐడియా వల్ల మీకెంత టైమ్ కలిసొస్తూందో" అందామె ఆనందంగా.

"నిజమే" అన్నట్టు తను ఆమెను మెచ్చుకోలుగా చూశాడు.

పదిహేను రోజులు పోయాక, జీతం తీసుకున్న రోజున త్వరగా ఇంటికి వచ్చేసి "నీకో మంచి చీర కొంటాను, మార్కెట్‌కి వెళ్దాం తయారవ్వు" అన్నాడు తను.

"ఇప్పుడెందుకు? చీరలు చాలా వున్నాయి"

" నాకు కొనాలనిపించింది. రా"

"అలాగే కొందురుగాని. అయితే ఇప్పుడు కాదు, పండక్కి" అంది.

తను నిరుత్సాహపడ్డాడు. అది గమనించినట్టుంది కమల.

"మీరీ నెల మీనాన్నగారికి డబ్బు పంపాల్సి వుంది. ఎంతో అవసరం వుంటేనే కానీ ఆయన అడగరు" అంది తన చెయ్యి పట్టుకుని.

చీరల వ్యామోహం లేనందుకే కాదు, తన బాధ్యత గుర్తు చేసినందుకు కూడా ఆమెపై తనకు అభిమానం కలిగింది.

ఆ రోజు 'క్షణ క్షణం' సినిమా చూశారు. ఇంటికొచ్చేక క్షణమైనా కంటి మీద కునుకు లేకుండా గడిపారు. ఎప్పుడూ "ఇలా సంతోషంగా వుండగలిగితే ఎంత బావుంటుందో" అంది తన తల నిమురుతూ.

అలాంటిదెలా మారిపోయిందో! బ్యాంకులో మూలుగుతున్న డబ్బు, అదీ అంతా కాదు, కొంత ఇవ్వడానికి దానికి మనసు రాలేదు. ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసింది కదా. ఆ యాభై వేలూ ఏ డెబ్బై వేలో అయ్యుంటాయి ఈ పాటికి. తనకిస్తే, వచ్చే ఆ వడ్డీ పోతుందనుకుందేమో. ఆ వడ్డీ ఏదో తనే ఇచ్చేస్తానని అనాల్సింది. తనకు తట్టలేదు. అసలు అది తనకివ్వనని అంటుందనే అనుకోలేదు. అదా మాట అనగానే తన బుర్ర మొద్దుబారిపోయింది. తను కారులో తిరిగితే తనకూ గౌరవమే కదా. ఆ ఏడుపేంటి! తమింటికి స్నేహితులు రారా, వాళ్లంటికి తాము వెళ్లమా?

రోజులెప్పుడూ ఒకలా వుండవనీ, మనుషులెప్పుడూ ఒకేలా వుండరనీ అంటారందుకే కాబోలు.

"భలే పెళ్లాంరా బాబూ" అనుకుంటూ కృష్ణమోహన్ అటెండర్‌కి ఆ లెటరిచ్చి, కొరియర్ సర్వీసులో పంపమని చెప్పి తన కేబిన్ నుంచి బయటికి వచ్చాడు.

కేంటిన్‌కెళ్లి టీ తాగుతూంటే "హలో" అని పలకరించాడు కృష్ణమోహన్ కొలీగ్.

"ట్రైనింగ్‌కి ఎప్పుడెళ్తున్నారు"

"ఎప్పుడెళ్లేదీ ఇంకా నిర్ణయించుకోలేదు"

"ఈ నెలాఖరు వరకూ టైమున్నట్టుందిలెండి"

"వుంది" అన్నట్టు తలూపాడు కృష్ణమోహన్.

ఆఫీసు విషయాలు మాట్లాడుకుంటూ టీ తాగి తమ కేబిన్‌లోకెళ్లారు.

"ఏంటో అంతా అయోమయంగా వుంది. తను కానీ ట్రైనింగ్‌కి వెళ్లకపోతే, ఈ అవకాశాన్ని తన కొలీగ్‌కు ఇస్తారు" అని నిట్టూరుస్తూ ఆ రోజు దినపత్రిక సాహిత్యం పేజీ చదువుదామని టేబుల్ మీద పెట్టాడు.

## ఒకే పడకపై ఇద్దరూ ఒంటరిగా!

కృష్ణమోహన్ ఇంటి మెట్లెక్కి కాలింగ్ బెల్ నొక్కాడు. తలుపు తెరవలేదు. మళ్లీ నొక్కాడు. మళ్లీ నొక్కాడు.

బదులు లేదు. సణుక్కుంటూ చిరాగ్గా అలాగే నిలబడ్డాడు. ఓ అయిదు నిమిషాలకు కమల తలుపు తెరిచింది.

"మొగుడు ఆఫీసు నుంచి అలసిపోయి వస్తాడు, వెంటనే తలుపు తీయాలి అని లేదు" అంటూ కృష్ణమోహన్ విసురుగా నడుస్తూ బాత్‌రూమ్‌కెళ్లి ముఖం కడుక్కుని వచ్చాడు.

టీపాయ్ మీద టీ కప్పు వుంది. తాగాడు. పొద్దుట గబగబా తిరగేసిన పేపరు చదువుతూ కూర్చున్నాడు. కమల బెడ్ రూమ్‌లోకెళ్లి పుస్తకం తెరిచింది.

రాత్రి ఎనిమిది గంటలు దాటింది. కృష్ణమోహన్ డైనింగ్ టేబుల్ దగ్గరికెళ్లి భోంచేశాడు. వక్కపొడి నములుతూ ముందు గది దాటి, వరండాలోకెళ్లి కూర్చున్నాడు.

కమల ఓ కథ పూర్తిచేసి, భోం చేసింది. వక్కపొడి డబ్బా తెరిచి, రెండు పలుకులు నోట్లో వేసుకుంది. ముందు గదిలో కెళ్లి టీవీ పెట్టింది. కేబుల్ టీవీలో ఏదో పాత సినిమా వస్తోంది. అదయ్యే వరకూ చూస్తూ కూర్చుంది. టీవీ కట్టేసి పడగ్గదిలో కెళ్లి పడుకుంది.

కృష్ణమోహన్ ముందు గది తలుపువేసి, పడగ్గదిలో కొచ్చాడు. కమల బెడ్ మీద చివరగా పడుకునుంది.

కృష్ణమోహన్ అమె పక్కనే కొంచెం దూరంగా పడుకున్నాడు.

ఆ గది శుభ్రంగా వుంది. గోడల కేసిన రంగు చూడముచ్చటగా వుంది. డబుల్‌కాట్‌కి కొంచెం దూరంలో గోడకు ఆన్చి డ్రెస్సింగ్ టేబుల్ ఉంది. గోడ రంగు కంటే కొంచెం ముదురు రంగులో వుందది. డబుల్‌కాట్‌కి కాస్త దగ్గరలో వున్న అలమారాలో కమల అప్పుడప్పుడూ కొన్న రక రకాల సైజుల బొమ్మలున్నాయి. మంచం మీంచి చేయి చాపితే అందేలా టేప్ రికార్డర్ వుంది. ట్యూబ్‌లైట్ కాంతిలో ఆ గది మొజాయిక్ ఫ్లోర్ మరింత మెరుస్తోంది.

కృష్ణమోహన్ కళ్లు మూసుకుని, కమల లైటార్పుతుందేమోనని కాసేపు చూశాడు. కృష్ణమోహన్ లైటార్పుతాడేమోనని కమల పడుకుంది. ఓ పావుగంట పోయేక ఇక లాభం లేదని, కృష్ణమోహన్ లేచి లైటార్పి పడుకున్నాడు.

"ఆడపుట్టుక పుట్టింది కానీ, అసలు ఒద్దికే లేదు" అనుకున్నాడు.

"ఎవరి కోసం ఆర్పుతాడు" అనుకుంటూ కమల అటు తిరిగి పడుకుంది.

"తను ఇప్పుడేం చేయాలి? డబ్బెలా సంపాదించాలి? పి.ఎఫ్.లోనో, ఎల్.ఐ.సి.లోనో తీసుకోవచ్చు. అయితే, అది అంత తొందరలో రాదు. అది వచ్చేటప్పటికి పుణ్యకాలం మించిపోతుంది. ఏ ఫ్రెండూ అంత మొత్తం ఇవ్వలేడు. దీని డబ్బు కాపీనం వల్ల బ్యాంకులో సొమ్ము వుండీ అప్పుకోసం తను తిప్పలు పడాల్సి వస్తోంది. ఇలాంటి దానితో తను ఎ ందుకు కలిసి వుండాలి? విడాకులు ఇచ్చేస్తేనో. అప్పుడింకో పెళ్లి చేసుకోవచ్చు. ఆవిడ మాత్రం దీనిలా వుండదని ఏమిటి? అంతా ఇలాగే వుంటారేంటీ? అమ్మ నాన్న దగ్గర ఎంత అణిగిమణిగి వుండేదో. నాన్న మాటకి ఇప్పటికీ ఎదురు చెప్పదు. నాన్న అదృష్టవంతుడు" అనుకుంటూ కళ్లు తెరిచి పైకి చీకట్లోకి చూశాడు.

"ఆ మధ్య ఫ్రెండ్స్ భోం చేస్తున్నప్పుడు ఇతను... వీడు ఎంతటి అధికారం చెలాయించాడు? టేబుల్ మీద సాల్ట్ బాక్స్ పెట్టడం మరిచిపోయింది తను. సాల్టేదీ? వేగిరం తీసుకురా అని అరిచాడు. కుక్కలు అరుచును" అనుకుంటూ మనసులో నవ్వుకుంది.

"నిన్ను నిన్నుగా ప్రేమించుటకు, నీ కోసమే కన్నీరు నించుటకు..." సాధ్యం కాదా! మరి, ఇలాంటి వీడితో ఇలా బతకాల్సిందేనా? విడిపోతే... బ్యాంకులో కాస్త డబ్బుంది. ఇంటర్ చదువుకు ఏదో చిన్న ఉద్యోగం రాకపోతుందా? ఒంటరిగా బతకొచ్చు హాయిగా.... ఒంటరి బతుకు హాయిగా వుంటుందా? అలాంటి దాఖలాలేమన్నా వున్నాయా? మరొకణ్ణి పెళ్లి చేసుకుంటే.... వాడు వీడికంటే ఘనుడైతే.... ఇందాక చదివిన పుస్తకంలో... బోసి ముడ్డితో ములక్కాడ వూపుకుంటూ... ములక్కాడ...." అని కసిగా అనుకోగానే కమలకు నవ్వొచ్చింది. ఆపుకోలేకపోయింది.

"ఏం ఘనకార్యం చేసిందని ఆ నవ్వు. మొగుణ్ని బాధపెట్టడం గొప్పనుకుంటుందేమో. సాయంత్రం చదివిన వ్యాసంలో.. కమలాదాస్ కథలో రెండు కాళ్ల మధ్య పండిపోయిన కాకరకాయలా.... మరి ఆడదో... రెండు తొడల మధ్య ఎండిపోయిన రావి ఆకులా.... రావి ఆకు" అని వెటకారంగా అనుకుంటూ కృష్ణమోహన్ ఫకాలున నవ్వాడు.

వాళ్లిద్దరికీ నిద్ర రావడం లేదు. వాళ్ల ఆలోచనలు అలా సాగుతూనే వున్నాయి. కమల తను చదువుకున్న నేటి సాహిత్యానికీ, కాలానికీ అనుగుణంగా కొంతవరకు ఆలోచిస్తోంది. అతనుకూడా మరో కోణంలో ఆలోచించే వరకూ ఆ విశాలమైన గది వాళ్లకు ఇరుకు ఇరుకుగా ఉక్క ఉక్కగానే వుంటుంది.

●

# 'మేం సమర యోధులం కామా!?'





నాటి నేతాజీ బాడీగార్డు-
నేడు ఒక కూలీ!

నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఈ దేశానికి మంచి చేశాడో, చెడు చేశాడో చరిత్రకారులకే తెలియాలి కాని ఆయన అనుచరులుగా ఒకనాడు వీర సిపాయిలై తెల్లవారి గుండెల్లో నిదురించిన నేటి వృద్ధ దేశభక్తులకు మాత్రం చివరకు కన్నీళ్లే మిగిలాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నమాటే గానీ నేతాజీ మార్గదర్శకత్వంలోని అజాద్ హింద్ ఫౌజ్‌లో పనిచేసిన చాలామందికి ఇప్పుడు బతకుతెరువుకు కడివెడు నీళ్లు కరువైపోయాయి. 'మేమేం పావం చేశామని మాకీ శిక్ష?!...మేం చేసిన త్యాగం ఈ దేశంకోసం కాదా!?' అంటూ గుండెనిండా అలాంటి అభాగ్యులంతా ప్రశ్నిస్తున్నా నేటి మన నాయకులకు ఆ గోడు చెవికి సోకటంలేదు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తాతపూడి కృపానందం ఆత్మఘోష విన్నవారికెవరికైనా ఈమేరకు హృదయం క్షోభించకపోదు.

పశ్చిమ గోదావరి జిల్లా చాగల్లు మండలం చిక్కాల గ్రామానికి చెందిన కృపానందం 1940లోనే సైన్యంలో చేరాడు. రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొని 1942 ఫిబ్రవరి 15న ఒక విపత్కర పరిస్థితిలో సింగపూర్‌లోని మలయావద్ద జపాన్ సైనికులకు దొరికిపోయాడు. అక్కడ్నుంచీ తప్పించుకుని 'నేతాజీ' స్థాపించిన అజాద్ హింద్ ఫౌజ్‌లో సిపాయిగా చేరాడు.రెండేళ్లపాటు బ్రిటీష్‌వారితో జరిగిన వివిధ పోరాటాలలో పాల్గొని చివరకు బ్రిటీష్ సైన్యానికి చిక్కిపోయాడు.కలకత్తా సమీపంలోని జగల్ కచ్చార్‌లో ఖైదీక్యాంప్ నిర్వహించి దొరికిపోయిన అజాద్ హింద్ ఫౌజ్ సిపాయిలందరినీ కాల్చి పారేయాలని బ్రిటీష్ దొరలు కుట్రపన్నారు. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూల వాదన, కృషి, చొరవల ఫలితంగా ఈ ఖైదీ సిపాయిలను వదిలేశారు.75 వేల మంది ఖైదీలను వివిధ కేటగిరీలుగా విభజించి ఒక్కొక్కరికి ఒక్కో న్యాయాన్ని వర్తింపజేశారు బ్రిటీష్‌వారు. వైట్ కేటగిరీ వారికి ఎలాగోలా ఉద్యోగాలు, తగిన భద్రతలు కల్పించారుకాని మిగిలిన పోరాట యోధ సిపాయిలకు మాత్రం కనీస పెన్షన్‌కూడా లేకుండా వదిలేశారు.

తాను కల్నల్ డి.ఎస్.రాజు, మళయాళీ డాక్టర్ లక్ష్మిలు సుభాష్ చంద్రబోస్‌తో సన్నిహితంగా వ్యవహరించేవారమని, ఒకరకంగా తాను నేతాజీకి బాడీగార్డులా వున్నానని కృపానందం తన గత స్మృతులను నెమరు వేసుకుంటూ చెప్పారు. 1947లో స్వాతంత్ర్యం సిద్ధించాక స్వంతవూరు చేరుకున్నానని చాలారోజులపాటు ఆకులు, అలములు తింటూ అడవుల్లోనే గడిపానని దీంతో శారీరకంగా బాగా శుష్కించిపోయానని కృపానందం చెప్పారు. కనీస ఉపాధికూడా కరువై పోవడంతో జీవితం దుర్భరమైన కృపానందం చివరకు రోజువారీ కూలీగా మారిపోయాడు.

ఇప్పుడు కృపానందంకు 82 ఏళ్లు. అజాద్ ఫౌజ్‌లో పనిచేసిన సిపాయిలందరికీ స్వాతంత్ర్య సమరయోధులకు ఇచ్చే పెన్షన్‌ను ప్రభుత్వం ఇవ్వదంటూ అనేకమంది జిల్లా కలెక్టర్లు చెబుతున్న మాటలు వినివిని ఆయన గుండె బండబారింది. భారత సోల్జర్ బోర్డులో అజాద్ హింద్ ఫౌజ్ లేకపోవడాన్ని నిరసిస్తూ 'ఫౌజ్ ఈ దేశ విముక్తి కోసం పోరాడిన సైన్యంకాదా?!' అంటూ కృపానందం ప్రశ్నిస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చి 49 సంవత్సరాలు పూర్తికావస్తున్నా బ్రిటీష్‌వారి విధానాలనే భారత నాయకులు అవలంభించడం అన్యాయం కాదా అని ఆయన అడుగుతున్నారు. దేశం స్వర్ణోత్సవాలకు చేరుకుంటున్న ఈ దశలోనైనా కేంద్రప్రభుత్వం ఆనాటి బ్రిటీష్ బానిస చట్టం నుంచి తమను విముక్తుల్ని చేయాలని కృపానందం కోరుకుంటున్నారు. ఆయన కోరిక న్యాయబద్ధమో కాదో నేటి నేతలే చెప్పాలి మరి!

-ఎం.ఎ.అఫ్జల్